# గలగలా గోదారి

-భైరవయ్య

'మా కొద్దీ తెల్ల దొరతనము'' అని భారత దేశం యావత్తూ గర్జించినట్టు భీమవరం వీధులు మారుమ్రోగాయి. వీధివీధినా, సందు సందునా జనం. అణువణువునా స్పందించిన జనం. దృఢ నిశ్చయం గుండెల్లో ఘనీభవించిన జనం. లండన్ పురవీధుల్లో తమ గర్జనలు ప్రతిధ్వనించేట్టు గళాలు విప్పిన జనం.

అలా, ఆ జన సమూహం కదిలిందిరా అబ్బాయ్. పిల్ల నదులన్నిటినీ కలుపుకుని అఖండ గౌతమిగా రాజమహేంద్రవరం దగ్గర రూపుదాల్చినట్టు; జనసమూహాలన్నీ కలిసి, పెద్ద బజారు దగ్గర, ఒత్తుగా పండిన వరి చేలలా జనం. అందరి గొంతులూ కలిసి, అందరి నిశ్చయాల్నీ మెలేసుకుని తరంగాలుగా ప్రతిధ్వనిస్తున్న దొకటే పాటరా అబ్బాయ్. 'మా కొద్దీ తెల్ల దొరతనమూ' అని. ఆ దీక్ష, ఆ స్ఫూర్తి మళ్ళీ చూడగలమంటావా?

పెద్ద బజారు దగ్గర బల్లలు పరిచి, ఆ బల్లల మీద ఖాదీ దుప్పట్లు వేసిన వేదిక సిద్ధంగా వుంది. వేదిక దగ్గర జనాన్ని అదుపు చేస్తూ వెంకటరత్నంగారు, సుబ్బారాయుడు గారు, శేషారావుగారు, రామచంద్రరాజుగారు, లక్ష్మీనారాయణగారు- అలా పెద్దలంతా వున్నారు. వలంటీర్లు ఎక్కడికక్కడ జనాన్ని సర్దుతున్నారు. అల్లర్లు జరగకుండా కాచుకుంటున్నారు.

జనాన్ని అందుకునేటంత దూరంలో పోలీసులున్నార్రా అబ్బాయ్. స్వయంగా పర్యవేక్షణ చేస్తూ కలెక్టరు దొరగారు కూడా వున్నారు.

అది స్వాతంత్ర్య సమరంరా అబ్బాయ్. అవి సత్యాగ్రహపు రోజుల్రా. తెల్లవారిని దేశం వదిలి పొమ్మని, నిర్ద్వంద్వంగా గాంధీగారు చెప్పారు. ఆయన గొంతులో యావత్భారత దేశం గర్జించిందిరా. పెద్ద పెద్ద నాయకుల్నందరినీ, దొరతనం వారు జైళ్ళలోకి తోసేశారు. ఊరూరా వాడవాడా 'క్విట్ ఇండియా' అంటూ జనం వీధుల్లోకి వచ్చేశార్రా. అప్పటికింకా అరెస్టు కాబడని నాయకులు వూరూరా తిరిగి జనాలకి ఉత్సాహాన్నివ్వసాగార్రా. ఆ సందర్భంగానే, ప్రకాశంపంతులుగారు భీమవరం వస్తున్నారని. పెద్ద బజారు దగ్గర మీటింగు ఏర్పాటు చేసారు. అందుకే ఆ హడావుడీ, ఆ బందోబస్తూను.

పోలీసు బందో బస్తులో కనిష్టేబు పెద్దప్పడు కూడా వున్నాడ్రా అబ్బాయ్. ఆరడుగుల పైనుండీ, రెండు చేతులా చుట్టినా మిగిలి పోయే చుట్టుకొలతతో

## కనిష్టేబు పెద్దప్పడు

దేవగన్నేరు పువ్వుల్లాంటి కళ్ళతో, చిన్న పిల్లలు ఉయ్యాల వూగడానికి వీలుగా వుండే మసాల్తో; పెద్దప్పడు నిజంగానే పెద్దప్పడ్రా అబ్బ... ఎంత విశాలమైన మనిషో గుండె కూడా అంతే విశాలమైందిరా అబ్బాయ్. లౌక్యం లవలేశమైనా తెలియని అమాయకత్వమూ అంత విశాలమైనదేరా అబ్బాయ్. ఆ భారీ విగ్రహాన్ని చూసి దొరతనం వారు వుద్యోగమిచ్చేర్రా. అంత పెద్దప్పడికీ అక్షరం ముక్కమటుకు అవగింజంతైనా అబ్బలేదు. అదేమీ పెద్దప్పడికి అవరోధం కాలేదులే.

పెద్దప్పడ్ని చూస్తే, ఇనస్పెక్టరు రాఘవరావుకి మా చెడ్డ జాలీ అభిమానమూన్రా అబ్బాయ్.

'ఏ ధర్మరాజుగారిదగ్గరో ద్వాపర యుగంలో పని చెయ్యాల్సిన వాడివోయ్ పెద్దప్పడు. నిన్ను ఈ పోలీసులోకి తీసుకున్న దొరగారిగా సమయంలో తలకాయ పనిచేసి వుండదు' అంటూ వుండేవాడు.

''అయ్'' అని నవ్వెయ్యడం పెద్దప్పడికి మామూలు.

చిల్లర దొంగల క్కూడా పెద్దప్పడంటే అభిమానమేరా. అందుకే చిల్లర దొంగల వైనం తెలుసుకోడానికి పెద్దప్పడ్నే వినియోగించేవారు. పెద్దప్పడి విగ్రహాన్ని చూసి మొదట్లో భయపడ్డా, ఆ తర్వాత వాళ్ళకి అతనంటే అభిమానం పెరిగిపోయిందిరా.

వచ్చిన పెద్దప్పడ్ని చూసి, 'మీరెందుకండీ రావడం. కబురు చేస్తే మావే వచ్చేవాళ్ళంగదండే. సరుకింకా అమ్మెయ్య లేదండి. ఇయిగోనండి. అంటూ పెద్దప్పడి వెనకే వచ్చేసేవారు స్టేషనుకి.

పెద్దప్పడి బీటులో దొంగతనాలు, రవుడీ వేషాలు వుండేవి కాదురా. ఎవడైనా తారసపడితే, వాళ్ళు పెద్దప్పడికి దణ్ణంపెట్టి, 'తవరిగోరి డూటీయేటండి. తెలవదండి. దండాలండి' అని వెళ్ళిపోయేవారు.

పెద్దప్పడు ఎవర్నీ పల్లెత్తు మాటనేవాడుకాదురా చెయ్యెత్తడమనేది అసలే లేదు.

తప్పచేసి ఎవడైనా పెద్దప్పడి కంట బడితే, వాడి చెవి పట్టుకునేవాడు. 'బుద్ధిలేదుట్రా యెదవకాన. ఎందుకా యెదవపని. ఏదైనా పనిచేసుకు సావకూడదూ' అనేవాడు.

''సెవ్వొగ్గీయండి బాబో. వూడిపోద్ది. తప్పేనండి. యెదవ పని చేసి తవరికి మళ్ళీ అగపడనండి'' అనే వాడవతలివాడు.

''అంటే యెదవేశాలు మానవన్నమాట. బుద్ధిలేనెదవ''.

''కాదండీ. మాట తిరకాసొచ్చిసందండీ. తిడతారెందుకండీ''.

''కొడితే సచ్చిపోతావురా''

''అది నిజవేనండి. కొట్టక్కర్లేదండి. తాటి మొద్దులాగుందండి. ఆ సెయ్యిమీదడేత్తేసాలండి''.

అలా జరిగేదిరా సంభాషణ.


అటువంటి పెద్దప్పడు కూడా ఆ రోజున బందోబస్తులో వున్నాడ్రా అబ్బాయ్.

పాతనీరుకి కొత్తనీరు చేరుతున్నట్టు వున్న జనానికి తోడుగా చుట్టుపక్కల వూళ్ళ నుంచి కూడా జనం వచ్చి పడుతున్నారు. పాట మీద పాట అందు కుంటున్నారు. ఒకరు పాడితే వెనక జనం యావత్తూ వంతపాడుతున్నారు. నినాదాలు బకింగ్‌హామ్ ప్యాలెస్ దాకా విన పడుతున్నాయి.

''ఆవేశాన్ని ప్రదర్శించకండి. ప్రశాంతంగా వుండండి. మనది ధర్మయుద్ధం'' అని పెద్దలు హెచ్చరిస్తూనే వున్నార్రా. వలంటీర్లు జనాన్ని అదుపు చేస్తూనే వున్నారు.

అంత జనాన్ని చూస్తోన్న దొరగారి తెల్లటి ముఖం ఎర్రబారుతోంది. ఆయనకి అవకాశం చిక్కటం లేదు. రూలు ప్రకారం పోయే మనుషులు కదరా. పేరు పెట్టి తరవాత కొట్టే మనుషులాయె. అందుకని దొరగారు రూలుకోసం వెతుక్కుంటున్నారు.

జనమంతా నిదానంగానే వున్నారు. నినాదాలిస్తూనే వున్నారు. పాటలు పాడుతూనే వున్నారు. వచ్చిపడుతున్న కొత్త జనానికి చోటు సర్దుబాటు చేస్తూనే



వున్నారు. చెరువులో చిరుకెరటాల్లా చిన్న చిన్న చలనాలు తప్పించి, దొరగారికి అవకాశమిచ్చే తొడ తొక్కిడిలాంటిది కూడా ఏమీ జరగటం లేదురా అబ్బాయ్.

ఆ జనాన్ని చూస్తోన్న పెద్దప్పడి గుండె పొంగు తోందిరా. ఆ పొంగుచూసి, "ఓయ్ పెద్దప్పడూ జాగర్త. కలెక్టుదొరగారు ఇక్కడే వున్నారు" అని హెచ్చ రించాడు రాఘవరావు.

"ఆయ్. చిత్తవండి".

నిశ్చలంగా వున్న జనం కదిలార్రా అబ్బాయ్.

"అరుగో ప్రకాశం గారొస్తున్నారు". అని ఎవడో కేకేశాడు.

ఆయన్ని చూడాలన్న తహతహలో జనం కదిలార్రా. ఒకర్ని తోసుకుని ఒకరు, ఒకరి మీంచి చూడాలని మరొకరు, అలా జనం ముందుకు కదిలారు. అలా కదలడంలో పోలీసుల సమీపానికి ఒక పాయ వచ్చింది. అది చూసి రాఘవరావు ఖంగారు పడ్డాడు. పెద్దప్పడు కూడా ఖంగారు పడిపోయాడు.

"బాబో యిటెంపు రాకండి" అని గట్టిగా అరిచాడు.

విషయం అర్థంగాని దొరగారికబ్బాయ్, రూలు దొరి కిందిరా. "ఛార్జ్" అని గట్టిగా అరిచారు. పోలీసుల లాఠీలు పైకిలేచాయ్. జనం అటూ యిటూ అడ్డు పడ్డార్రా, బెదిరిన ఆవులమందలాగ. అలా బెదిరిన జనంలో ఒకరిద్దరు దొరగారిమీద కూడా పడ్డారు. "ఛార్జ్" [illegible]



అందరూ పోలీసుల్తో పాటు పెద్దప్పడూ జనం మీదికొచ్చాడు. పట్టుకు నలుగురైదుగుర్ని, పోలీసుల లాఠీల కందకుండా వెనక్కి తోసేస్తూ. "బాబ్బాబు. యెనక్కెళ్ళిపోండి. దొరగారు మా తిక్క మీదున్నారు. యెనక్కెళిపోండి. లాఠీ తగలకుండా కిందన్నా పడి పోండి. పడిపోయి కదలకండి". అని జనాన్ని వెనక్కి తోస్తూ, కొడుతున్నట్టు నటిస్తూ బతిమాలుకున్నాడ్రా. మొహం మటుకు భీకరంగా పెట్టాడ్లే.

అంతసందట్లోనూ 'మా కొర్దీ తెల్లదొరతనమూ' [illegible] కున్నార్రా. ఒకటే ఘోష. కదిలే జనం నిలబడి పోయారు. పోలీసులూ నిలబడి పోయారు.

విచ్చుకున్న గొంతుకలన్నీ ఒకటే గర్జన, "మా కొర్దీ తెల్లదొరతనమూ' అని.

ఒరేయ్ అబ్బాయ్. అంతవరకూ ఉగ్గబట్టుకున్న పెద్దప్పడింక వుండలేక పోయాడ్రా. చేయ్యెత్తి, పిడికిలి బిగించి జనంకేసి చూస్తూ 'మా కొర్దీ తెల్ల దొర తనమూ' అని గొంతు కలిపాడ్రా.

అది చూసి ఖంగారుపడ్డ రాఘవరావు దొరగారికేసి చూసాడు. తెలుగురాని దొరగారి కేమీ అర్థం కాలేదు. అన్ని గొంతుకల్లో కలిసి పోయిన పెద్దప్పడి గొంతు ఏమంటోందో ఆయనకి తెలియలేదు. భీకరంగా వున్న పెద్దప్పడి రూపమొక్కటే ఆయనక్కనిపించింది.

"ఏమిట"న్నట్లు రాఘవరావుకేసి చూసారు.

"వాళ్ళందర్నీ వెనక్కెళ్ళి పొమ్మంటున్నాడండి" అని చెప్పాడు రాఘవరావు.

ఆ గొడవ సర్దుమణిగాక స్టేషను చేరిం తర్వాత,' అలా ఒళ్ళు మర్చిపోతే ఎలాగయ్యా పెద్దప్పడూ' అనడిగాడు రాఘవరావు.

"ఆయ్. మరేనండి" అని చిన్నగా నవ్వాడ్రా పెద్దప్పడు.



